నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | మార్చి 03, 2024 | www.navatelangana.com

మొక్కలు ఎండపోనివ్వొద్దు

- నర్సరీని సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ ఆధ్వర్యంలో జయశంకర్ కాలనీలో పెంచుతున్న నర్సరీని శనివారం కలెక్టర్ పరిశీలించారు. నర్సరీలో ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు ఎండిపోకుండా నీటిని ప్రతినిత్యం పట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. హరితహారం కోసం మొక్కలను సిద్ధం చేయాలని కోరారు.



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న కలెక్టర్

ఇంటర్ పరీక్షల్లో 427మంది గైర్హాజరు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్ రెండవ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 427 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. జిల్లాలో ఈరోజు 97 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్ ల ఆధ్వర్యంలో 46 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని తెలిపారు.



నిజామాబాద్ ఇంటర్ వాల్యుయేషన్ క్యాంప్ అధికారిగా రవికుమార్

నిజామాబాద్ లోని ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం అధికారిగా రవికుమార్‌ను ఇంటర్మీడియట్ బోర్డు నియమించింది. రవికుమార్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులుగా కొనసాగుతుండగా, అలాగే ఆయనను నిజామాబాద్ మూల్యాంకన కేంద్రం పూర్తి స్థాయి అధికారిగా నియమించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే
కఠిన చర్యలు తప్పవు

- రౌడీ షిటర్లతో సీపీ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనివార్ తెలిపారు. విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం పోలీస్ పరేడు గ్రౌండ్ లో రౌడీ షిటర్ల మేళా నిర్వహించారు. పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో మొత్తం 326 మంది రౌడీ షీటర్లు ఉన్నారని, ఈ మేళాలో రౌడీషిటర్ల దినచర్యలను వారి రాకపోకలను క్షుణ్ణంగా తెలుసుకోవడం, వాళ్ల ఇప్పటి వరకు ఎవరెవరిని కలిసారు, ఎందుకోసం కలుస్తున్నారు, భవిష్యత్తులో ఎలాంటి అల్లర్లకు / శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారు అనే దానివి తెలుసుకున్నట్టు తెలిపారు. కావున రౌడీ షిటర్లు వారు ప్రతీ రోజు వారి ఉద్యోగం నిర్వహించుకుంటు వారి ఇంటి వద్దనే ఉండాలని ఏ తగాదాలలో పాల్గొనవద్దని, ప్రధాన కూడళ్లలో సమావేశాలలు నిర్వహించకూడదని, రాత్రి సమయాల్లో హెూటళ్ల వద్ద పాన్ షాపుల వద్ద ఉండరాదని తెలియజేశారు. ప్రతీ ఒక్క రౌడీ షిటరు తమ నడవడికను మార్చుకోవాలని, లేనియెడలవారి పై తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవ్వరికైనా వ్యక్తిగత ప్రతిష్టకుభంగం కలిచించడం లేదా సమాజంలో ఉద్రిక్తతలను రేపే విధంగా వ్యవహరించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీసారి చట్టప్రకారం కేసులు నమోదు అవుతుంటాయని, అలాంటి వారిపై పి.డి యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రొబైషనరీ ఐ.పి.ఎస్., బి. చైతన్య రెడ్డి, నిజామబాద్, ఆర్మూర్, బోధన్ ఎ.సి.పిలు ఎల్. రాజా వెంకట్ రెడ్డి, బస్వారెడ్డి, పి. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సి.ఐలు, ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

చేరికలపై ఫోకస్

- 'కారే' లక్ష్యంగా పావులు కదపుతున్న 'చేతు'
- హస్తంలోకి జోరుగా వలసలు
- ఖాళీ అవుతున్న కారు
- నిలువరించేవారెవరు..?



నవతెలంగాణ-లింగంపేట్

చేరికలపై అధికార పార్టీ ఫోకస్ చేసింది. బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా ఆ పార్టీ నుంచి పెద్దఎత్తున చేరికలపై నజర్ వేసింది. అవకాశం కోసం ఎదురు చూస్తున్న ఆ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు.. హస్తంలో చేరేందుకు రెడీ అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు చోటుచేసుకున్నాయి. కాగా.. మరోమారు పెద్దఎత్తున చేరికలు ఉన్నట్టు కాంగ్రెస్ నాయకులు సంకేతాలు ఇస్తున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. మొన్నటి వరకు కిందిస్థాయి క్యాడర్ పార్టీ మారగా.. తాజాగా జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సైతం పార్టీని వీడటంతో శ్రేణుల్లో స్తబ్ధత నెలకొంది. ముఖ్య నాయకులు సైతం ఆలోచనలో పడ్డారు. ఇంత జరుగుతున్నా.. బీఆర్ఎస్ పార్టీలో నిలువరించే వారే ఖరువైపోయారు. చేరికలను ఆపేందుకు ఉమ్మడి జిల్లాలో ముఖ్య నేత కరువైనట్టు ఆ పార్టీలోనే చర్చలు వినిపిస్తున్నాయి.

ప్రతిపక్ష బీఆర్ఎస్ వలసలను అరికట్టడంలో ఎంత ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు బీఆర్ఎస్, బిజెపి పార్టీ నుండి వచ్చిన నాయకులను కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి స్వాగతిస్తున్నారు. పది సంవత్సరాలపాటు ఎల్లారెడ్డి గడ్డపై గులాబీ జెండా రెపరెపలాడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోవడంతో పాటు పార్లమెంట్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో అధికార పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. ముఖ్య నాయకుల ప్రధాన అనుచరులు సైతం పార్టీలను వీడుతూ కాంగ్రెస్‌లోకి చేరుతున్నారు.

ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీచేసి 35 వేల భారీ మెజార్టీతో గెలుపొందారు. అప్పట్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో గెలుపొందిన కొన్ని నెలలకే బీఆర్ఎస్‌లో చేరారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రధాన అనుచరులను బీఆర్ఎస్‌లో చేర్చడంపై దృష్టి పెట్టారు. తాజాగా పరిస్థితి రివర్స్ అయింది. అప్పట్లో చేరిన వారందరూ తిరిగి కాంగ్రెస్ వైపు దారి కట్టారు. మొట్టమొదట అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లింగంపేట్ జెడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి సొంత గూటికి వెళ్లగా.. వారి వెంట పలువురు ఎంపిటిసిలు సర్పంచులు పార్టీలో చేరారు.

అందరు చూపు హస్తం వైపు

ఎల్లారెడ్డి నియోజకవర్గం లోని ఆయా మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు సింగిల్ విండో చైర్మన్ గ్రామ కమిటీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికే చేరారు. ఇప్పటికే చేరికల వరుస రోజురోజుకు కొనసాగుతుంది. లింగంపేట్ మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు బండి రాజయ్య, పోల్కంపేట్ మాజీ సర్పంచ్ మనిగిరి పద్మ నాగరాజ్ బోనాల్ మాజీ సర్పంచ్ కురుమ సాయిలు పలువురు గత వారం రోజుల క్రితం ఎమ్మెల్యే మదన్ రావు మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో నుంచి ముఖ్య నాయకులు చేరుతూనే ఉన్నారు.

ఎల్లారెడ్డి మండలంలో ఏడుగురు మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధారి మండలం గండివేటు మాజీ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ గాంధారి ఏఎంసీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతారెడ్డి మేడిపల్లి గ్రామ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు షాబుద్దీన్ తో పాటు పలువురు చేరారు. నాగిరెడ్డిపేట మండలం చెందిన టీఆర్ఎస్ ప్రధాన నాయకులు నర్సారెడ్డి మహిపాల్ రెడ్డి నరేందర్ రెడ్డి మల్యా రెడ్డి సంజీవరెడ్డి తో పాటు ఎమ్మెల్యే మదన్మోహన్రా రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నాగిరెడ్డిపేట మండలంలోని వడ్డేపల్లి సుభాష్ రెడ్డి ప్రధాన అనుచరుడు జనార్ధన్‌రెడ్డి బొల్లారం మాజీ సర్పంచ్ బిజెపి నేత ధనుంజయ్ బిజెపి నాయకులు నఫీజ్ పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మరో వారం రోజుల వ్యవధిలో నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట్ లింగంపేట్ ఎల్లారెడ్డి తాడ్వాయి గాంధారి రామారెడ్డి రాజంపేట సదాశివనగర్ మండలాలకు చెందిన తాజా మాజీ సర్పంచులు ఎంపీటీసీలు గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలోకి చేరడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం. అదేవిధంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ లోని పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఇప్పటికే మంతనాలు జరిపి చేరే మార్గం సుగమం చేసుకున్నారు. వారం రోజుల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఉండడంతో ప్రతిపక్ష బి ఆర్ ఎస్ కారు పార్టీ ఖాళీ అవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వలసల నివారణను కారు పార్టీ నాయకులు అదుపు చేయలేకపోతున్నారు. ఒకవైపు పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో కారు పార్టీ కి కష్టాలు మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నేడే పల్స్ పోలియో..

- మరో రెండు రోజుల పాటు ఇంటింటా సర్వే
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదేండ్లలోపు పిల్లలు
- 2,93,636 మంది గుర్తింపు
- పోలియోను తరిమేద్దామని అధికారుల పిలుపు



నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్/కంఠేశ్వర్/కామారెడ్డి

పల్స్ పోలియోకి సర్వం సిద్ధమైంది. పోలియో మహమ్మారిని రాష్ట్రం, దేశం నుంచి తరుముదామంటూ ఐదేండ్ల లోపు చిన్నారులకు నేడు (ఆదివారం) రెండు చుక్కల మందు వేయనున్నారు. ఇందుకోసం ప్రధాన కూడళ్లతో పాటు స్కూళ్లు, కాలేజీలు, అంగన్‌వాడీలు, పీహెచ్‌సీలు, ఆస్పత్రులు, కుల, కార్మిక సంఘాల భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నారు. మిగిలిపోయిన చిన్నారుల కోసం సోమ, మంగళవారాల్లో మరో రెండు రోజుల పాటు పోలియో చుక్కలు వేయనున్నారు. 100 శాతం లక్ష్యం చేరేలా ఇంటింటికీ తిరిగి పిల్లలందరికీ టీకాలు వేయనున్నారు. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,93,636 మంది ఐదేండ్ల లోపు పిల్లలు ఉన్నట్టు వైద్యారోగ్యశాఖ అధికారులు గుర్తించారు.

నిజామాబాద్ జిల్లాలో 1,91,081 మంది ఐదేండ్ల లోపు పిల్లలను గుర్తించారు. వీరికి పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు జిల్లా వ్యాప్తంగా 1007 పల్స్ పోలియో బూత్ లను అధికారులు ఏర్పాటు చేశారు. వీటితో



కామారెడ్డిలో ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్



నిజామాబాద్‌లో ర్యాలీ చేపట్టిన వైద్య, ఆరోగ్య సిబ్బంది

పాటు మరో 37 ట్రాన్సిట్ బూత్ లు, 37 మొబైల్ బూత్ లు నెలకొల్పామని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుదర్శనం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమిస్తూ, 2.40 లక్షల పోలియో డోస్‌లను సమకూర్చారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఐదేండ్ల లోపు పిల్లలు 1,02,555 మంది ఉన్నట్టు గుర్తించారు. పోలియో చుక్కలు వేసేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 733 పోలియో బృందాలతో పాటు మరో 48 సంచార బృందాలను ఏర్పాటు చేసి 2,932 ఏ.యెన్.ఎం. ఆశా కార్యకర్తలు, 69 మంది సూపర్వైజర్ల సేవలను ఉపయోగించనున్నారు. అదేవిధంగా మరో 24 ఆరోగ్య కేంద్రాలలో పోలియో చుక్కలు వేయనున్నట్టు అధికారులు తెలిపారు.

అవగాహన ర్యాలీలు

కంఠేశ్వర్ : కాగా ఈ నెల 3 , 4 , 5 తేదీలలో నిర్వహించ నున్న పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టరేట్ మైదానం నుండి ప్రధాన వీధుల గుండా మెడికల్ కళాశాల వరకు ఈ ర్యాలీ కొనసాగింది. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. చిన్నారులు పోలియో వ్యాధిబారిన పడకుండా ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. అన్ని నివాస ప్రాంతాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ప్రభుత్వ ఆసుపత్రులలో, అంగన్వాడీ కేంద్రాలు, పల్స్ పోలియో బూత్ లు, రైల్వే స్టేషన్, బస్టాండ్ ల వద్ద ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో నివారణకై చుక్కల మందు వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా కూడా వారికి చుక్కల మందు వేయించాలని సూచించారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందు వేయించాలని కోరారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు : కలెక్టర్

కామారెడ్డి : నేడు నిర్వహించనున్నట్టు పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి నుంచి ప్రధాన వీధుల గుండా నిజాంసాగర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీని శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కలు అని, అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరు పోలియో వ్యాధిబారిన పడకుండా ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. అన్ని నివాస ప్రాంతాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ప్రభుత్వ ఆసుపత్రులలో, అంగన్వాడీ కేంద్రాలు, పల్స్ పోలియో బూత్ లు, రైల్వే స్టేషన్, బస్టాండ్ ల వద్ద ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో నివారణకై చుక్కల మందు వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా కూడా వారికి చుక్కల మందు వేయించాలని సూచించారు.తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందు వేయించాలని కోరారు. పల్స్ పోలియో అవగాహన ర్యాలీలో జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్. వైద్యారోగ్య శాఖ అధికారులు, ఏ.ఎం.ఎంలు, ఆశ వర్కర్లు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

సిట్టింగులకే టికెట్

- నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన బీజేపీ.. బరిలో అరవింద్, బీబీపాటిల్
- బీజేపీలో చేరిన రెండో రోజే బీబీపాటిల్‌కు టికెట్

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్



ధర్మపురి అరవింద్



బీబీ పాటిల్

బీజేపీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో బరిలో నిలవనున్న అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం శనివారం ఖరారు చేసింది. నిజామాబాద్ నుంచి ఎంపీ అరవింద్‌కు టికెట్ ఖరారు చేయగా.. జహీరాబాద్ నుంచి బీబీపాటిల్‌కు టికెట్ కేటాయించింది. శుక్రవారమే బీబీపాటిల్ బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరగా.. శనివారమే టికెట్ ఖరారు కావడం గమనార్హం. కాగా సిట్టింగ్ ఎంపీలకే మళ్లీ టికెట్ కేటాయించినట్టయింది.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధిష్టానం రాష్ట్రంలోని 9 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన సిట్టింగ్‌లకే సీట్లు ఖరారు చేసినట్టు అయింది. నిజామాబాద్ టికెట్‌ను ఈసారి అరవింద్‌కు ఇవ్వొద్దని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. అరవింద్ ఒంటెద్దు పోకడలు, అహంకార మాటలు మాట్లాడుతూ పార్టీకి నష్టం చేకూరుస్తున్నట్టు స్వయంగా ఆ పార్టీ నాయకులే నిరసన వ్యక్తం చేశారు. అయినా పార్టీ అధిష్టానం అరవింద్‌కే టికెట్ కేటాయించేందుకు మొగ్గు చూపడం గమనార్హం.

ఇక జహీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్‌కు పార్టీలో చేర్చుకున్న మరుసటి రోజే బీజేపీ టికెట్ కేటాయించడం గమనార్హం. ఈసారి బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిస్తే ఓటమి ఖాయమని స్థానికంగా ప్రచారం నెలకొంది. దీనికి తోడు తన వ్యాపారాలను దృష్టిలో ఉంచుకొని బీబీపాటిల్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే జహీరాబాద్ నుంచి బరిలో నిలిచేందుకు పలువురు ఆశావహులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నం చేశారు. పార్లమెంట్ పరిధిని చుట్టుముట్టి వచ్చారు. తమకే టికెట్ వస్తున్నట్టు దీమా వ్యక్తం చేశారు. ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి సైతం బీజేపీ నుంచి టికెట్ ఆశించారు. బీబీపాటిల్‌కు టికెట్ కేటాయించిన నేపథ్యంలో వారు తమ భవిష్యత్ కార్యచరణ ప్రకటించే అవకాశం ఉంది.

అమిత్‌షాను కలిసి బీబీపాటిల్

మద్నూర్ : ఇటీవల బీజేపీలో చేరిన జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ శనివారం హోంశాఖ మంత్రి అమిత్‌షాను తన తమ్ముడితో మరార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమిత్ షాకు పూలబొకే ఇచ్చి సన్మానించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని, ఇక్కడ ఈటల రాజేందర్‌ను కలిశారు.

గ్రూప్-1కు ఉచిత కోచింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి గ్రూప్-1కు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు డైరెక్టర్ సి.హెచ్.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తులను నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్‌లోని నిర్మల హృదయ స్కూల్‌కి ఎదురుగా, ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్ రెండవ అంతస్తు లో గల బీసి స్టడీ సర్కిల్‌కు వచ్చి నేరుగా అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నెం 08462-241055, 8639002255లను ఆఫీస్ వేళలలో సంప్రదించాలని సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతపూర్‌లో గల హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లో 2024- 25 విద్యా సంవత్సరంనకు ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియం నందు ప్రవేశం కోసం షెడ్యూల్ తెగల వారు ఎస్టీ (5), ఇతర షెడ్యూల్ తెగల వారికి (1) మొత్తం ఆరు సీట్లు బాలుర, బాలికలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఇంచార్జ్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి జి. రజిత శనివారం ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. దరఖాస్తు ఫారం జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం రూమ్ నెంబర్:208 నుంచి ఉచితంగా పొందవచ్చు అని సూచించారు. దరఖాస్తు చేయు బాల, బాలికలు తేదీ 01.06. 2017 నుంచి 31.05.2018 లోపల జన్మించి ఉండాలని, ఐదు సంవత్సరాలు నుండి ఆరు సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.1.50 గ్రామీణ ప్రాంతాల్లో,రూ. 2 లక్షలు పట్టణ ప్రాంతాల్లో మించి ఉండరాదని పేర్కొన్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యాసంగి ధాన్యం కొనుగోలుకు 347 కేంద్రాలు

- నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలి : సమీక్షలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

యాసంగిలో ఏర్పాటు చేసే దాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో 347 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై పౌరసరఫరా, వ్యవసాయ, మార్కెటింగ్, ఐకెపి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో 325, ఐకెపి ఆధ్వర్యంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

యాసంగిలో వచ్చే వరి పంట దిగుబడిని అంచనా వేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి నిత్యానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
ఆదివారం | మార్చి 03, 2024 | www.navatelangana.com

నూతన చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్



జిల్లా న్యాయస్థానముల సముదాయంలో కొత్త న్యాయ చట్టాలు భారతీయ న్యాయ సన్హిత్ - 2023, భారతీయ నాగరిక్ సురక్షా సన్హిత్- 2023, భారతీయ సాక్ష అధినియం - 2023పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మొహమ్మద్ రహీముద్దీన్ నిర్వహించారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నూతన చట్టాలను అవలంభించి నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, జిల్లా కోర్టు అడిషనల్ పిపి వసంత్, మహిళా కోర్టు పిపి, ఎస్ఐలు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంకోసం తోడ్పాటు

నవతెలంగాణ-ముప్కాల్


విరాళం అందజేస్తున్న సంఘం పెద్దలు

మండలకేంద్రంలో శుక్రవారం దేవాలయం అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం లక్ష పదహారు రూపాయలను యాదవ పెద్ద సంఘం ప్రతినిధులు శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు యాదవ పెద్ద సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలకేంద్రంలోని ఆయా కుల సంఘాల ప్రతినిధులు సైతం ఆలయ నిర్మాణానికి తమవంతు తోడ్పాటును అందిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

20వ వార్షికోత్సవం వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

- జబర్దస్త్ టీం రాక


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్కూల్ యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్‌లో మార్చి 7న 20వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ లాంచింగ్ కార్యక్రమాన్ని శనివారం పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు, డాన్స్ టీచర్ల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జబర్దస్త్ నటులు బుల్లెట్ భాస్కర్, నరేష్, జితేందర్ హాజరవుతున్నారని నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ తెలిపారు. స్నేహితులు, శ్రేయోభిలాసులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని 20 వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎంఆర్ఓ, ఎంపిడివోలకు సన్మానం


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-నవీపేట్

మండలానికి నూతనంగా విచ్చేసిన ఎమ్మార్వో నారాయణ, ఎంపిడీవో నాగనాథ్‌ను శనివారం సన్మానించారు. బినోల సొసైటి చైర్మన్ మగ్గరి హన్మండ్లు, నాళేశ్వర్ మాజి సర్పంచ్ ద్యాగ సరీన్ శాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా ఇరువురికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాగాజి లక్ష్మణ్, రమేష్, క్రిష్ణ ఉన్నారు.

ఇద్దరు గైర్హాజరు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సుపరింటెండెంట్ డి. శివకుమార్ శనివారం తెలిపారు. ఇంటర్ రెండవ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షను మొత్తం 192 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 190 మంది విద్యార్థులు రాసారని, ఒకేషనల్ పరీక్షకు 16 మందికి 16 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఫ్లైయింగ్ క్వాడ్ టీమ్ సందర్శించారు.

గృహ జ్యోతి జీరో బిల్లు అందజేత


బిల్లు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

గృహ జ్యోతి కార్యక్రమంలో భాగంగా కరెంటు బిల్లు జీరో బిల్లు పట్టణంలోని రాంనగర్‌లో అందజేశారని డీఈ హరిచంద్ నాయక్ శనివారం తెలిపారు. కార్యక్రమంలో ఏడిఈ శ్రీధర్, జేఏఓలు హరీష్, ప్రకాష్, ఎల్ఎం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు .

స్వయం పరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ప్రధానోపాధ్యాయులుగా, ఉపాధ్యాయులుగా, వ్యాయామ ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలను బోధించారు. బాధ్యతలు నిర్వహించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయులు పి.గణేష్, ఈ.గణేష్, లక్ష్మీ ప్రసన్న, అనిత, పాఠశాల మాజీ చైర్మన్ చిన్న చిన్నయ్య పాల్గొన్నారు.

సరోజిని నాయుడు వర్ధంతి

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కిడ్స్ పార్క్ స్కూల్లో సరోజినీ నాయుడు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆమె చేసిన సేవలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదేండ్లలోపు చిన్నారులకు
పోలియో చుక్కలు వేయించాలి

అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-బాల్కొండ/ముప్కాల్

బాల్కొండ: ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేయించి విజయవంతం చేయాలని అన్నారు. మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో శనివారం ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో పల్స్ పోలియో గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కల మందు వేయించి పోలియో వ్యాధి నివారణకు కృషి చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ యశ్వంత్, మెడికల్ హెల్త్ సూపర్వైజర్ ప్రభాకర్, వాణి పాల్గొన్నారు.

ముప్కాల్: పోలియో చుక్కల కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామస్తులకు తెలిసేలా అవగాహన ర్యాలీ నిర్వహించినట్టు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యం.రాకేష్ తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లల నుండి 5 సంవత్సరాల వయస్సు లోపు గల పిల్లలకు ప్రతి సారి 'పోలియో మోతాదు' రెండు చుక్కలను వేసుకోవడం ద్వారా పిల్లలు పోలియో వ్యాధి సోకకుండా ఉంటారని ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది సీహెచ్వో యం.మనీషా, ఏఎన్ఎం పి.పద్మ, ఆశావర్కర్లు ఉమ, అమృత, అనిత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


బాల్కొండలో...


ముప్కాల్‌లో...

పొట్ట కూటి కోసం సెక్స్ వర్కర్ వృత్తిని ఎంచుకున్న వారిపై చిన్నచూపు తగదు : జడ్పీ చైర్మన్

నవతెలంగాణ కంఠేశ్వర్

పొట్టకూటి కోసం (జోగిని) సెక్స్ వర్కర్ వృత్తిని ఎంచుకున్న వారిని చిన్న చూపు చూడకూడదని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్రావు అన్నారు. ఆర్థిక స్థితిగతులు, ఇతర కారణాలవల్ల ఈ వృత్తిని ఎంచుకున్నారని వారికి సహాయ సహకారాలు అందిస్తానని వారు భరోసా ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో మహిళ అంతర్జాతీయ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విఠల్‌రావు హాజరై మాట్లాడారు.

స్నేహ సొసైటీ కార్యదర్శి .సిద్దయ్య 2006 నుండి ఈ వత్తిపై ఆధారపడి వారు అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు ఎంతో కషి చేస్తున్నారని తెలిపారు. పిల్లల భవిష్యత్తును దష్టిలో ఉంచుకుని మంచి వత్తిలోకి అడుగు పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో స్నేహ సొసైటీ టార్గెటేడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్దయ్య, స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ సెక్స్ వర్కర్ల అభ్యున్నతి కోసం న్యాయమూర్తి, కలెక్టర్ జిల్లా సాయి అధికారులు, ప్రజాప్రతినిధుల దష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, హెచ్ఐవి ప్రోగ్రాం డిపిఎం సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ సభ్యులు తాటి వీరేశం, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ భానుప్రియ, స్నేహ సొసైటీ టార్గెటేడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు మేనేజర్ మోయిజ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ మహాలక్ష్మి, గృహలక్ష్మి

అందకపోతే ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన సూచన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


మాట్లాడుతున్న ఎంపీడీవో

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈ పంచాయతీ ఆపరేటర్లతో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల అభివృద్ధిలో ముఖ్యమైన 10 శాఖలపై సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం వివరాలు సేకరించేందుకు వ్యవసాయం, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్, పౌరసరఫరాల శాఖ, మిషన్ భగీరథ, విద్య తదితర శాఖల అధికారులతో ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన వివరాలను సేకరించి ఆన్ లైన్ లో పొందుపరచనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సమావేశంలో ప్రజా పాలనలో ఆరుగ్యారంటీల దరఖాస్తులపై చర్చించారు. ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి లబ్ధిచూకూరకపోతే ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రూ.500 కే గ్యాస్ సిలిండర్ రానట్లయితే లబ్ధిదారులు ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తు రసీదుతోపాటు గ్యాస్ ఏజెన్సీ బిల్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లతో ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదిస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అర్హులకు అందకపోతే కూడా ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత పత్రాలతో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, మండల పంచాయతీ అధికారి సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.

విప్లవోద్యమ పురోగతికి
విప్లవ పార్టీల అఖిలభారత ఐక్యత సభలు

నవతెలంగాణ-ఆర్మూర్

విప్లవోద్యమ పురోగతికే విప్లవ పార్టీల అఖిల భారత ఐక్యత సభలు నిర్వహించడం జరుగుతుందని, విప్లవ పార్టీలు ఐక్యత వైపు అడుగులు వేయాలని మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. రైతులు, కార్మికులు, ఉద్యోగ సంఘాలు, రైతు కూలీలు ఈ సభలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దేశంలో ప్రజాపంథా పార్టీతోపాటు సిపిఐ (ఎంఎల్) ఆర్ఐ, పీసీసీ సిపిఐ (ఎంఎల్) పార్టీలు విలీనమై సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ దేశ వ్యాప్త పార్టీగా అవతరిస్తున్న జాతీయ మహాసభలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని ఆయన వివరించారు. సమావేశంలో పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి దేవారం, ఆర్మూర్, బాల్కొండ, జక్రాన్‌పల్లి మండలాల సంయుక్త కార్యదర్శి కిషన్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ముత్తెన్న, డివిజన్ నాయకులు రాజన్న, తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ నాయకులు నసిర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శనివారం కాంగ్రెస్ గూటికి చేరారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. భీమ్‌గల్ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి ఆధ్వర్యంలో మాజీ ఎంపిటిసి రత్నయ్య, వార్డు సభ్యులు భోజన్న, గంగాధర్, రాజేశ్వర్, అశోక్ రమేష్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

రేకుల షెడ్డుల తొలగింపు

నవతెలంగాణ - బాల్కొండ


షెడ్డును తొలగిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో సర్వే నంబరు 1333 ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన రేకుల షెడ్డులను తొలగించామని శనివారం తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. గతంలో సర్వేనెంబర్ 1333 ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా గత కొన్ని రోజులుగా కలెక్టర్ ఆదేశాలతో ఇక్కడ సర్వే జరుగుతుంది. ఈ క్రమంలో అక్రమంగా ఇటీవల రేకుల షెడ్డులను కొంతమంది ఏర్పాటు చేశారు. దీంతో రేకుల షెడ్డులను శనివారం తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తొలగించారు.

టీబీ ముక్త్ గ్రామంగా యానంపల్లి ఎన్నిక

- సర్వే చేసిన అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


సర్వే చేస్తున్న అధికారులు

జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ గ్రామపంచాయతీగా మండలంలోని యానంపల్లి గ్రామాన్ని ఎన్నుకున్నారు. శనివారం యానంపల్లి గ్రామంలో సర్వే ప్రారంభించారు. ఈ సర్వేలో ఎవరైనా జ్వరం, తీవ్రమైన దగ్గుతో బాధపడుతూ ఉన్నట్లయితే వారి తెమడ శాంపుల్స్ తీసుకొని పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి మండల ఆరోగ్య విస్తరణాధికారి వై.శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రకమైన లక్షణాలు కలిగిన వారు ఎవరైనా ఉన్నట్లయితే వారికి తెమడ పరీక్షలు చేయించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఇప్పటికే కొన్ని గృహాలను సందర్శించి వారి ఇంట్లోవారి ఆరోగ్య పరిస్థితులను, వివరాలను సేకరించడం జరిగిందని వివరించారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీల్లో 19 గ్రామ పంచాయతీలు క్షయ రహిత గ్రామాలుగా ఎంపిక చేశారని తెలిపారు. ఈ గ్రామాల్లోని డేటా వెరిఫికేషన్ కోసం ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బృందం యానంపల్లి, కొట్టాలపల్లి గ్రామపంచాయతీలను సందర్శించి అక్కడ ఉన్న డేటాని తనిఖీ చేశారని చెప్పారు. ఎంపికైన గ్రామాల్లో చిన్నయానం, గాదెపల్లి, మందాపూర్, ముల్లంగి (బి), జోర్పూర్ దేగాం, యస్.బి. తాండ, బాబానగర్, పోచంపల్లి, జల్లపల్లి, కారేగాన్, లింగితాండ, అబ్బపూర్, భిక్నెల్లి, బద్గుణ, నాగేపూర్ రెంజల్, కొట్టాలపల్లి, యానంపల్లి ఉన్నాయి. కార్యక్రమంలో టిబి కో ఆర్డినేటర్ రవిగౌడ్, టీబీ సూపర్వైజర్ పద్మ, టీబీ ల్యాబ్ సూపర్వైజర్ స్రవంతి , గ్రామపంచాయితీ కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్త గంగుబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ, నాసిరకం మద్యం విక్రయాలను ప్రతిఘటించండి

నవతెలంగాణ-ధర్పల్లి


మాట్లాడుతున్న నాయకులు

అక్రమ, నాసిరకం మద్యం విక్రయాలను ప్రతిఘటించాలని సిరికొండ, ధర్పల్లి మండలాల్లో అక్రమ, నాసిరకం మద్యం తయారుచేసి విక్రయిస్తున్న మద్యం (వైన్స్) వ్యాపారులను ప్రతిఘటించాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) పార్టీ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైన్స్ యాజమాన్యం చేస్తున్న నాసిరకం మద్యం తయారీ విక్రయాలపై కలెక్టర్‌తోపాటు మండల అధికారులకు, అబ్కారిశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తే అధికారులు విచారణ చేపట్టడంలో కాలయాపన చేస్తూ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న వైన్స్ యాజమాన్యం తమ అక్రమ వ్యాపారాన్ని ఎంతో సక్రమమైంద న్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఫిర్యాదు దారులమైన తమకు సమాచారం ఇవ్వకుండా అబ్కారిశాఖ వారు విచారణ చేసింది ఏమీ లేదని తేలినట్లు వైన్స్ యాజమాన్యం చెప్పుకుంటున్నారని అన్నారు. అబ్కారిశాఖ అధికారులు తమకు సమాచారం ఇచ్చి విచారణ జరపాలన్నారు. మద్యం మ్యాపియా ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందు గ్రామాల్లో ఉన్న బెల్ట్, మద్యం షాపులను రద్దుచేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని మద్యంవ్యాపారులు ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి, మండలాలకు చెందిన వైన్స్ యాజమాన్యాలు విచ్చలవిడిగా గ్రామాలను పంచుకొని నాసిరకం మద్యంతయారు చేస్తున్నారని అన్నారు. బెల్ట్‌షాప్‌లను నిర్వహిస్తు నాసిరకం మద్యం విక్రయిస్తు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారన్నారు. అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్న మూడు వైన్స్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాప్‌లను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, ప్రజా సంఘాల డివిజన్, మండల నాయకులు, దామోదర్, సాయరెడ్డి, లింబాద్రి, రమేష్, కిషోర్, నరేష్, సర్పంచ్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి అజ్మీర ఇందుకు అభినందనలు


అజ్మీర ఇందును అభినందిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అజ్మీర ఇందును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఇటీవల జాతీయస్థాయిలో జరిగిన సాఫ్ట్ బాల్ క్రీడల్లో బంగారు పతకం సాధించినందుకు ఈ జట్టును అభినందించినట్టు ప్రిన్సిపాల్ జి. ధనవేణి శనివారం తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సైతం అభినందిస్తూ రాష్ట్రానికి కాక జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిందని ప్రశంసించారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని అజ్మీర ఇందును ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలు అభినందించడం హర్షణీయమని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన పిడి స్వప్నను సైతం అభినందించారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్

నవతెలంగాణ-మాక్లూర్


పనులను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్

మండలంలోని పలు గ్రామాల్లో ట్రైనీ ఐఏఎస్ అధికారిని, డీఆర్డీఏ పిడి సాయాగౌడ్ అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముల్లంగి(బి) గ్రామంలో ఉపాధిహామీ పనులను, ధర్మోరా గ్రామంలో నర్సరీని, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనం, సింగంపల్లి తండాలో సంపద వనాన్ని పరిశీలించారు. అదే విధంగా కృష్ణ నగర్‌లో మహిళ స్వయం సహాయక సంఘాల పని తీరును, మహిళలు అవలంభిస్తున్న ఆదాయ అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. మహిళలు డైరీ ఫాం, సోలార్ ప్లాంట్ వినియోగం, పాండిల్స్ తీగలు ద్వారా కూరగాయల పెంపకం, ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతుల గురించి సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ క్రాంతి, డీపీఎం సాయిలు, స్త్రీనిధి ఆర్ఎం రామ్ దాస్, గారు, ఏ పిఎం అనిల్ కుమార్, నాన్ ఫామ్ ఏ పిఎంలు, సిబిఓ ఆడిటర్, సీసీలు, గ్రామ సంఘాల వివోఏలు పాల్గొన్నారు.

దుద్దిళ్ల శ్రీపాదరావుకు నివాళి

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దుద్దిల్లా శ్రీపాదరావు జయంతి వేడుకలు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస ఆధ్వర్యంలో అధికారులు, కార్యాలయ సిబ్బంది శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదాశివ్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలపై తల్లిదండ్రులకు అవగాహన


పోలియోపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలోని వాసవీ పాఠశాల ప్రీ ప్రైమరీ విద్యార్థుల తల్లిదండ్రులకు రోటరీ అధ్యక్షులు పొలబోయిన సత్యం ఆదివారం వేయబోయే పోలియో చుక్కల ప్రాముఖ్యతను, వాటి వినియోగించుకునే విధానాన్ని వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ఐదు సంవత్సరాల వయసులోపు ఉన్న ప్రతి పిల్లలకు పోలియో చుక్కలు విధిగా వేయించుకోవాలని, తద్వారా భవిష్యత్తులో రాబోయే పోలియో సంబంధిత వ్యాధుల నుంచి పూర్తి రక్షణ పొందవచ్చునని తెలియజేశారు. తమ పిల్లలే కాకుండా తమ చుట్టుపక్కల ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించే బాధ్యతను ప్రతి తల్లి తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


విద్యార్థులకు ప్యాడ్స్ అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు హేమంత్ కుమార్, నాగరాజు, రాజేందర్ తెలిపారు. శనివారం మండలంలోని నందివాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివితేనే దేశంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని తెలిపారు. కృషి ఉంటేనే విజయం సొంతమవుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంస్థప్రతినిధులు కృష్ణాకర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సరిత, సంతోష్, దత్తాచారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి: శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు


కామారెడ్డి: జిల్లా పోలీసు కార్యాలయంలో...


బోధన్‌లో...

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి..

- మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- నివాళి అర్పించిన పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లా యువజన, క్రీడల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్పంచ్ స్థాయి నుంచి అసెంబ్లీ స్పీకర్ స్థాయి వరకు శ్రీపాదరావు ఎదిగారని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, ఆయన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా యువజన, క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కామారెడ్డి : జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దుద్దిర్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించినట్టు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ జార్జ్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేష్‌యాదవ్ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావుకు ఆయన జయంతి సందర్భంగా నివాళులర్పించారు. మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏ.ఈ సాయిలు, ఎంపీఓ మధుకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పల్లెదవాఖానా బంద్



ఎరాజ్‌పల్లిలోని పల్లెదవాఖానకు తాళం

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానలో సరిపడా వైద్య సిబ్బంది లేక పల్లె దవాఖానాలకు తాళం వేసే పరిస్థితులు దాపురించాయి. బోధన్ మండలం ఎరాజ్‌పల్లి గ్రామంలోని పల్లెదవాఖానలో ఇద్దరు ఏఎన్ఎంలు, ఒక స్టాఫ్ నర్సు విధులు నిర్వహిస్తున్నారు. వారంలో 5 రోజులు స్థానికంగా విధులు నిర్వహించినా.. శుక్ర, శనివారాలలో పల్లె దవాఖాన పరిధిలోని గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. దాంతో శుక్ర, శనివారాలు ఎరాజ్‌పల్లి వాసులకు వైద్య సేవలు అందడం లేదు. ఆశావర్కర్ కూడా వారితో పాటే వెళ్లడంతో పల్లెదవాఖానకు తాళమే దర్శనమిస్తుంది. గ్రామస్తులు శుక్ర, శనివారాలలో అత్యవసర వైద్య సేవల కోసం వస్తే తాళం చూసి వెనుదిరుగుతున్నారు. అధికారులు స్పందించి పల్లె దవాఖానాకు సరిపడా వైద్య సిబ్బందిని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలి

- ఎంపీవో శ్రీనివాస్


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలని ఎంపీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని అచ్చాయిపల్లి గ్రామపంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో వందశాతం పన్నులు వసూలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. అదేవిధంగా గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు.

పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్ అప్పగించిన దంపతులు


సెల్‌ఫోన్ అప్పగించిన దంపతులకు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీ వద్ద శనివారం రోడ్డుపైన ఓ ఫోన్ దొరకడంతో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన పత్రి రాజు, అతని భార్య అమృత దంపతులు ఇద్దరు కలిసి పోలీస్‌స్టేషన్ ఆ ఫోన్‌ను అప్పజెప్పారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి వారిద్దరినీ అభినందించి శాలువాతో సత్కరించారు. ఆ ఫోన్‌ను పోగొట్టుకున్న సంబంధిత వ్యక్తికి అప్పగించినట్టు సీఐ పేర్కొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

- స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి కళావతి

నవతెలంగాణ-పిట్లం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహిళా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని బాన్సువాడ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారిని కళావతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, కిడ్నాప్‌లు ఎక్కువవయ్యాయని తెలిపారు. ఇంకొందరు మైనర్ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, వేధిస్తూ క్రూరంగా హింసిస్తూ, పావులా వాడుకుంటున్నారని తెలిపారు. జిల్లా డి హబ్ అధికారిని తులసి మాట్లాడుతూ.. ఉన్నత తరగతి కుటుంబ మహిళల కంటే దిగువ గల మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహిళలు ఎక్కువగా బాధపడుతున్నారన్నారు. మహిళలు సాధారణంగా లింగ వివక్ష, నిరక్షరాస్యత, ఆడ శిశువు హత్య, వరకట్న సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సఖి కేంద్రం అధికారిని కళావతి మాట్లాడుతూ.. మహిళల కోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సఖి, మహిళా సాధికారిక, చైల్డ్ హెల్ప్‌లైన్, షీటీంలను సద్వినియోగపరుచుకొని పురుషులతో ధీటుగా ముందుకు సాగాలని ఆమె సూచించారు. అనంతరం భేటీబచావో-బేటిపడావ్ కార్యక్రమంపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దేవిసింగ్, చైల్డ్ హెల్ప్ లైన్, మహిళా సాధికారిక కేంద్రం అధికారి నీలు, సూపర్‌వైజర్ రేణుక అంగన్వాడీ టీచర్లు కుమ్మరి రాధా, ప్రవీణ, జయంతి, జంగం సుమలత, బాలమణి, శోభ, విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-విలేకరుల బృందం



కామారెడ్డిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పిట్లం : మండలంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియో ఏర్పాట్లు పూర్తయినట్లు వైద్యాధికారి రోహిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 5 సంవత్సరాలలోపు పిల్లలు 5 వేల మంది, ఉన్నారని వారి నిమిత్తం 30 పోలియో భూతులతో పాటు ఒక ట్రాన్సిస్టర్ (బస్టాండ్ ఆవరణలో) కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పోలియోను ఆయా కేంద్రాలలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలియో విజయవంతానికి ఒక మొబైల్ టీం, 160 మంది సిబ్బంది, 4గురు రూట్ సూపర్‌వైజర్‌లు, ఒక పర్యవేక్షణ అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు.

26 బూత్‌ల ద్వారా పల్స్ పోలియో..

నాగిరెడ్డిపేట్ : మండల వ్యాప్తంగా 26 బూత్‌లలో 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయనున్నట్టు మెడికల్ ఆఫీసర్ సుజన్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 2635 మంది చిన్నారులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం పల్స్ పోలియో చుక్కలను ప్రతిఒక్కరికీ వేయించాలని సూచించారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ ఆస్మా ఆఫ్రీన్ తెలిపారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో 2612 మంది పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. 23 బూతులు ఉన్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ చుక్కల మందును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఖమ్మం బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సిపిఐ(ఎంఎల్) నాయకులు

నవతెలంగాణ-బోధన్

మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మం జిల్లాలో నిర్వహించే కమ్యూనిస్టు పార్టీల ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఈ ఐక్యత మహాసభల్లో ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 3, 4, 5తేదీలలో ఖమ్మంలో జరగబోయే మూడు కమ్యూనిస్టు పార్టీల ఐక్యత మహాసభలు మనదేశంలో విప్లవోద్యమానికి ఒక మందు అడుగు లాంటివని సీపీఐ(ఎం-ఎల్) ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో దేశంలో ప్రజాపంథా మార్గం ద్వారానే విప్లవాన్ని విజయవంతం చేయగలుగుతామని అన్నారు. ఖమ్మంలో వేలాదిమందితో భారీ ర్యాలీ, బహిరంగ సభలను నిర్వహించనున్నట్టు తెలిపారు. 4,5 తేదీలలో 300ల మందితో ప్రతినిధుల సభలు జరుగుతాయని అన్నారు. ఈ సభలలో జర్మన్ దేశానికి చెందిన ఎం.ఎల్.పి.డి, నేపాల్, శ్రీలంక దేశాలకు చెందిన వారు సౌహార్ద ప్రతినిధులుగా పాల్గొంటున్నారని తెలిపారు. దానికోసం బోధన్ డివిజన్ నుంచి మూడు బస్సులలో పార్టీ నాయకులు శ్రేణులు, కార్యకర్తలు తరలివెళ్లనున్నట్టు తెలిపారు. సమావేశంలో పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, జి.సీతారాం, బి.నాగమణి, బీపాషా బేగం, అరుణ, శాంతక్క, సి.హెచ్.గంగయ్య లక్ష్మీబాయి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రశ్నాపత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రం

నవతెలంగాణ-రెంజల్

పదవ తరగతి పరీక్షా పత్రాలను మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఉపాధ్యాయ బృందం భద్రపరిచారు. ఈనెల 18 నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ముందుగా వాటిని భద్రపరిచి సీల్ వేశారు. ప్రశ్నపత్రాలు భద్రపరిచిన వారిలో మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, తాడ్‌బిలోలి ప్రధానోపాధ్యాయురాలు రేఖ, పిఆర్టియు మండల అధ్యక్షులు టి.సోమలింగంగౌడ్, ఉపాధ్యాయులు ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రశ్నాపత్రాలను భద్రపరుస్తున్న అధికారులు

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు


ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సేవ కేంద్రంలో ప్రజా పాలన దరఖాస్తులు ఎలాంటి పొరపాట్లు వచ్చినా వాటిని సరిచేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో డీఎల్పీవో సమావేశం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎల్లారెడ్డి డిఎల్‌పివో సురేందర్ మండల పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ పథకానికి సంబంధించిన అప్లికేషన్లను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 421 అప్లికేషన్లు వచ్చినట్టు తెలిపారు. వాటికి సంబంధించి పలు విషయాలను పంచాయతీ కార్యదర్శులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.

అంబేద్కర్‌నగర్ జీపీని తనిఖీ చేసిన డిఎల్‌పిఓ



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామపంచాయతీని డిఎల్పిఓ సాయి బాబా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అలాగే వందశాతం పన్నులు వసూలు చేయాలని గ్రామ కార్యదర్శి సునీల్ యాదవ్‌ను ఆదేశించారు.

పోలీసులకు కోర్టు ప్రాంగణంలో ఒకరోజు శిక్షణ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం బోధన్ డివిజన్ పోలీసులకు కోర్టు నిబంధనలు, నేరాల నమోదుపై, చట్టాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనరసయ్య ఆదేశాల మేరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించినట్లు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపారు. శిక్షణలో భాగంగా భారతీయ న్యాయ సంహిత చట్టం 2023పై అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు వివరించారు. భారతీయ నాగరికత సురక్ష సంహిత 2023పై అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య వివరించారు. అలాగే భారతీయ సాక్ష్య ఆదినీయం న్యాయం 2023పై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిత్రాల రాణి వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు పద్మారావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, బోధన్ లైజనింగ్ ఆఫీసర్ శంకర్, కోర్టు పోలీస్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి

నవతెలంగాణ-బిచ్కుంద

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురి కావడమే కాక ఇతరుల ప్రాణాలు హరిస్తున్నారని మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, నూతన బస్టాండ్ ముందర మిషన్ కల్లాలీ చౌరస్తాలో తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఆర్సీ, లైసెన్స్ లేని వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించి నంబర్ ప్లేట్‌లేని పది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అర్సి లైసెన్స్ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ఆర్‌సి, లైసెన్స్ వెంబడి ఉంచుకోవాలని మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళ దినోత్సవ వారోత్సవాలు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని దేవునిపల్లి అంగన్వాడీ, డ్రైవ ర్స్ కాలనీలో గల అంగన్వాడీ సెంటర్‌ల ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహిం చారు. 2వ రోజు ఆక్టివిటీ జెండర్ ఇక్వాలిటీ, మహిళా హింస వ్యతిరేక దినం, హెల్ప్‌లైన్ నెంబర్‌లపై అవగహన కల్పించారు. మహిళలు ఎదుర్కొంటున్న హింసల గురించి మహిళల సాధికారత గురించి చర్చించారు. కేంద్ర సిబ్బంది శారదా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, సఖి సిబ్బంది సాయవ్వ, కవిత, సఖి సర్వీసెస్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దేవునిపల్లి సెక్టార్ అంగన్‌వాడీ టీచర్స్, సఖీ సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. ఒకరు మృతి

నవతెలంగాణ-సదాశివనగర్

గుర్తు తెలియని వాహనం ఢీ.. ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటకు చెందిన షేక్ అలీ (46) టీవీఎస్‌పై వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. భార్య రఫియాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన



నవతెలంగాణ-భీంగల్

మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసిల్దార్ శ్రీలత, సిఐ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లింగ వివక్ష, డ్రాప్ అవుట్, బాలిక సంరక్షణపై అవగాహన కల్పించారు. అంతకుముందు బేటి బచావో బేటి పడావో పోస్టర్లను ఆవిష్కరించారు . కార్యక్రమంలో ఐసిడిఎస్ ఏ సిడిపిఓ జ్ఞానేశ్వరి, ఎంఈఓ స్వామి, ఎంపీఓ గంగా మోహన్ సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

7వ బెటాలియన్‌లో దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్ డిచ్పల్లిలో కమాండెంట్ బి. రాంప్రకాష్ ఆధ్వర్యంలో దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి వేడుకలను అసిస్టెంట్ కమాండెంట్ యం. శ్రీనివాస్ రావు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ దుద్దిల్ల శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ దుద్దిల్ల శ్రీపాద రావు చేసిన సేవలను, ఆయన రాజకీయ జీవితం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐలు పి. వెంకటేశ్వర్లు, ఆర్. ప్రహ్లాద్, యం. నరేష్, అర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచ్

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని నాలేశ్వర్ గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు, మాజీ తాజా సర్పంచ్ సరీన్ శనివారం ఆహ్వానించారు. ఈనెల 8, 9వ తేదీల్లో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో జరిగే ఉత్సవాల గోడ ప్రతులను అందించి ఆహ్వానించారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాగాజీ లక్ష్మణ్, రమేష్, కృష్ణ, శివ తదితరులున్నారు.

14న చలో ఢిల్లీ విజయవంతం చేయండి : ఏఐకేఎంఎస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం గతంలో రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని , రైతాంగసమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు పిలుపు నిచ్చారు, శనివారం నిర్వహించిన అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) డివిజన్ కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాయరెడ్డి పాల్గొని మాట్లాడుతూ చారిత్మాత్మకమైన రైతాంగ పోరాట ఫలితంగా మోడీ సర్కార్ రైతాంగానికి క్షమాపణ చెప్పి రైతాంగ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తానని చెప్పి లిఖితపూర్వకంగా హామీ నిచ్చి అమలుచేయలేదన్నారు.నిరంకుశంగా రైతాంగ ఉద్యమాలను అణిచివేయడం కోసం ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. హర్యానా, పంజాబ్‌కు చెందిన లక్షల మంది రైతాంగం తమ వాహనాల్లో శాంతియుతంగా ఢిల్లీకి యాత్ర నిర్వహిస్తున్న క్రమంలో ఆరాష్ట్ర బార్డర్లలో రైతాంగం పై కేంద్రం మోడీ ప్రభుత్వం విచక్షణంగ కాల్పులు జరిపి చావుకు కారణమయ్యారని అయన అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేని పక్షంలో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సంయుక్త కిషన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 14న ఢిల్లీలో నిర్వహించే ప్రదర్శన బహిరంగ సభకు రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు దేవస్వామి, కృష్ణాగౌడ్, బన్సీ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచ్‌కు సన్మానం



లోలం సత్యనారాయణను సన్మానిస్తున్న స్నేహితులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల సర్పంచుల ఫోరం మండల తాజా మాజీ అధ్యక్షులు లోలం సత్యనారాయణను డిచ్ పల్లి మండలం లోని రాంపూర్ డి గ్రామంలో పదవతరగతి క్లాస్ మేట్స్ శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో చదువుకొని సర్పంచ్‌గా చేసి గ్రామ ప్రజల మన్ననలు పొంది మండల సర్పంచ్ల ఫోరం కన్వీనర్ గా అంకిత భావంతో సేవ చేశారని అన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారన్నారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానన్నారు. క్లాస్మేట్ సన్మానం చేయడం ఎన్నటికీ మరిచిపోలేనిదని ఆయన అన్నారు.

అయోధ్యకు తరలిన రైలు

జెండా ఊపి ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



రైలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నుండి అయోధ్యకు వెళ్లే రెండో విడత ప్రతేక రైలును అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ మీడియాతో మాట్లాడుతూ.. అస్తా ప్రత్యేక రైలులో అర్బన్ నుండి 352 మంది, పార్లమెంట్ నుండి 1500 బయలుదేరారని, వారికీ భోజనం, టీ,స్నాక్స్ అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. భక్తులందరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అయోధ్యలో అడుగుపెట్టిన దగ్గరనుండి దర్శనం చేయించి మళ్లీ రైలు ఎక్కేవరకు పూర్తి బాధ్యత కేంద్రప్రభుత్వం రైల్వే సిబ్బంది, ఆలయ సిబ్బంది చూసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కులాచారి దినేష్, జిల్లా ఉపధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, కార్పొరేటర్స్ పంచారెడ్డి ప్రవళిక, ఎర్రం సుదీర్, బీజేపీ నాయకులు పవన్, పవన్ ముందడ, హరీష్ రెడ్డి, కిరణ్ జింజోడ్, బీజేపీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ నిజామాబాద్‌సిటీ

పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతలో భాగంగా చేపడుతున్న ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తో కలిసి సహాయ రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, భద్రతాపరమైన ఏర్పాట్లు, అంతర్రాష్ట్ర సరిహద్దులు, జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులను నెలకొల్పడం, ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్.టీ బృందాలను ఏర్పాటు చేసి వారికి శిక్షణ తరగతులు నిర్వహించడం తదితర అంశాలను సమీక్షిస్తూ, సహాయ ఎన్నికల అధికారులకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏవైనా అనుచిత సంఘటనలు చోటుచేసుకున్న వాటిని, అసాధారణ రీతిలో ఓటింగ్ నమోదైన వాటిని సమస్యాత్మక జాబితాలో చేర్చాలన్నారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర క్రియాశీలకమైనందున వారికి వచ్చే వారం రోజుల వ్యవధిలో సహాయ రిటర్నింగ్ అధికారుల స్థాయిలోనూ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి విధులు, బాధ్యతలపై క్షుణ్ణంగా తర్ఫీదు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో సెక్టోరల్ అధికారులకు శిక్షణ తరగతులు పూర్తి చేశామని గుర్తు చేశారు. మరోమారు ఏఈఆర్ఓ ల స్థాయిలోనూ సెక్టోరల్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాలని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను వారు నిర్దేశిత గడువులోపు అందించేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సమయంలో నీటి వసతి, టాయిలెట్స్, విద్యుత్, ర్యాంపులు వంటి వసతులను పరిశీలించాలన్నారు. అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల వద్ద తనిఖీ కేంద్రాలను నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్.టీ బృందాలకు కూడా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి, సి.విజిల్ యాప్, ఈ.ఎస్.ఎం.ఎస్ యాప్ లను వారు ఇన్ స్టాల్ చేసుకునేలా సూచించాలని అన్నారు. ముఖ్యంగా ఎన్నికల సంఘానికి వెంటదివెంట గడువులోపు నివేదికలను ఈ.ఎస్.ఎం.ఎస్ యాప్ ద్వారా పంపాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ.ఎస్.ఎం.ఎస్ పనితీరుపై పూర్తి అవగాహన కల్పించాలని, జాప్యానికి తావులేకుండా గడువులోపు నివేదికలు పంపించేలా బృందాలను సన్నద్ధం చేయాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ ఐ.పీ.ఎస్ చైతన్య రెడ్డి, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, బస్వారెడ్డి, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

పడిలేచిన మర్రిచెట్టుపై పాట చిత్రీకరణ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం 'శ్రీ శివలింగేశ్వర స్వామి' ఆలయ ప్రతిష్ఠ గురించి తెలుగు రాష్ట్రాలకు తెలిసేలా శనివారం కళాకారులతో పాట చిత్రీకరణ చేశారు. మండల కేంద్రానికి చెందిన పలువురు ప్రముఖులు పాట చిత్రీకరణ కోసం పాటుపడ్డారు. ఇందులో ఓ.రమేష్, ఉమేష్, రాంరాజ్, సతీష్ పలువురు ప్రముఖులు ఉన్నారు.



పాట చిత్రీకరిస్తున్న దృశ్యం

10ఏండ్లలో బీఆర్ఎస్ చేసింది శూన్యం

- కమీషన్ల కోసం పనిచేశారు..
- అక్షింతల పేర బిజెపి రాజకీయం
- ఉత్పత్తి లేకనే పసుపు ధర పెరుగుదల
- జీరో కరెంట్ బిల్లు కార్యక్రమాన్ని ప్రారంభించిన

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీ పథకాల్లో పదవిలో కొచ్చిన 48 గంటల్లోపే రెండు హామీలను అమలు చేశామని ఇప్పుడు ఇంకో రెండు హామీలను అమలు చేస్తున్నామని, గడిచిన 10 ఏళ్ల బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ ఏమి లేదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో కరెంట్ బిల్లు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్వయంగా నడిపల్లి గ్రామంలోని రెండు, మూడు నివాస గృహాలు తిరిగి కరెంట్ బిల్లును మిషన్ ద్వారా స్కాన్ చేసి లబ్ధిదారులకు జీరో బిల్లులను అందజేశారు. విద్యుత్తు 200 యూనిట్లు కంటే తక్కువ కావడంతో జీరో బిల్లు వచ్చిందని వివరించారు. అనంతరం నడ్పల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడారు. ఇల్లు సొంతంగా ఉన్న, అద్దెకు ఉన్న జీరో బిల్లు వస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పది ఏళ్ల పాలనలో ప్రాజెక్టుల పేర దోచుకున్నారని అన్నారు. మేడిగడ్డ కుంగిపోయిందని, కాళేశ్వరం అసలే పనికిరాదని, అన్నారం ప్రాజెక్టులో నీళ్ల లేవని , ప్రజాధనం దుర్వినియోగం చేశారని అన్నారు. గృహ జ్యోతిలో సిలిండర్ రూ.500 అందిస్తామన్నారు.

నియోజకవర్గానికి 3500 ఇండ్లు...

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు కరెంటు సంక్షేమ పథకాలే తెలంగాణ ప్రభుత్వంలో ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ 10 ఏళ్ల లోచేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. త్వరలోనే రైతు రుణమాఫీ పై సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేస్తారని అన్నారు. రైతు భరోసా వచ్చే ఖరీఫ్ పంట నుండి లబ్ధి చేకూరుతుందని వివరించారు. అర్హులైన రైతులకు రైతు బంధు వర్తింప చేస్తామన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 500వందల ఎకరాలు ఉన్నవారికి రైతుబంధు ఇచ్చిందని అన్నారు. పంట పండిన పండక పోయిన బీడు భూములకు కూడా రైతుబంధుని ఇచ్చి ప్రజా ప్రతినిధులకు లాభం చేకూర్చారని అన్నారు.

డిచ్‌పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఆసుపత్రిగా మారుస్తామని,ఇందల్ వాయి లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు అ శాఖ మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో డిగ్రీ కాలేజ్ ప్రారంభించి, చెరువు దగ్గర్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. డిచ్‌పల్లి,ఇందల్ వాయి వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి కేంద్ర ప్రభుత్వ సహాయంతో రైల్వే అండర్ గ్రౌండ్ వంతెన నిర్మాణం కోసం ప్రయత్నిస్తానని తెలిపారు.

రామాలయం ప్రారంభించక ముందే అక్షింతల పంపిణీ...

బిజెపి రామాలయం నిర్మించి ప్రారంభించక ముందే గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ అక్షింతలు పంపిణీ చేసి రాజకీయ రంగు పులిమిందని, రామాలయం పేరు చెప్పి ఓట్లు దండుకోవడానికి చేస్తున్న నాటకమని విమర్శించారు. మోడీ రెండుకోట్ల ఉద్యోగాలు, 15లక్షలు పేదలఖాతాల్లో వేస్తామని బూటకపు మాటలు మాట్లాడారని, దేశం కోసం ధర్మం కోసం అని కొత్త నాటకానికి తెరలేపారని అన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం తగదన్నారు.

ఉత్పత్తి లేకనే పసుపు ధర పెరుగుతుంది...

ఈ సీజన్లో ఎక్కువ మొత్తంలో పసుపు పండించకపోవడంతో మార్కెట్లో పసుపు లేక అమాంతం పసుపు ధర పెరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. దీనికి బిజెపి నాయకులు పసుపు ధర పెంచుతుంది మేమే అన్నట్టు వ్యవహరించడం విడ్డూరంగా ఉందని అన్నారు. బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ కుల గణన చేపట్టడానికి కేంద్రం సహకరించాలన్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ ఈ రవీందర్, డిఈ జాన్ ఉత్తం, ఎడీఇఈ శ్రీనివాస్,ఎ ఈ సాయిలు, సొసైటీ చైర్మన్లు రంచందర్ గౌడ్, తరచంద్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



జీరో బిల్లును అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

శ్రమ, పట్టుదలతోనే విజయం

కేజీబీవీ గురుకుల అధ్యాపక పోస్టులకు ఎంపిక

ప్రతిభ కనబరిన మాక్లూర్ కేజీబీవీ ప్రత్యేక అధికారి ప్రగతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గురుకుల అధ్యాపక పోటీ పరీక్షల ఫలితాల్లో మాక్లూర్ కేజీబీవీ ప్రత్యేక అధికారిని ప్రగతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడు పోస్టులకు ఎంపికైంది. జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్, బయోసైన్స్ పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికైంది. జూనియర్ లెక్చరర్ అత్యుత్తమమైనది కావడంతో ఆ పోస్టునే తీసుకుంటానని చెప్పారు. ప్రగతి 2017 నుండి కేజీబీవీ ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్నారు. అయితే ఆ ఉద్యోగం పర్మినెంట్ కాకపోవడంతో శాశ్వత ఉద్యోగం కోసం ప్రయత్నించింది. ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తూనే, మరోవైపు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడు పోస్టులకు ఎంపిక కావడం అభినందనీయం. ఇప్పటికే టీఎస్ సెట్ క్వాలిఫై అయ్యి తెలంగాణ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న ప్రగతి స్వస్థలం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కాలూర్ గ్రామం. నిరంతర శ్రమ, భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఈ విజయం దక్కిందని ప్రగతి తెలిపారు. ప్రత్యేక అధికారినిగా మాక్లూర్ కేజీబీవీని అత్యుత్తమంగా తీర్చిదిద్దిన ప్రగతి, విద్యార్థినిగా చదువుకున్న సమయంలో పిడిఎస్యు విద్యార్థి సంఘంలో, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేశారు. అదే క్రమంలో తోటి ఉద్యమ నాయకుడు సుధాకర్‌ను ఆదర్శ వివాహం చేసుకున్నారు.

గంజాయి అమ్ముతున్న ఇద్దరు అరెస్టు

నవతెలంగాణ-ఆర్మూర్

ఎక్సైజ్ టీం డిచ్పల్లి రోడ్డు మార్గంలో గస్తీ నిర్వహించుచుండగా సిఎంసి హాస్పిటల్ దేవుపల్లి సమీపంలో గంజాయి అమ్ముతున్నారు అనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ శనివారం తెలిపారు. రూట్ వాచ్ చేస్తుండగా గార్లుల పవన్, కళ్యాణ్ హీరో హొండా గ్లామర్ వెహికల్‌పై అనుమానాస్పదంగా కనిపించగా పట్టుకొని తనిఖీ చేయగా ఇతని వద్ద గంజాయి మూటా లభించిందని అరెస్టు చేసి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించామన్నారు. వారివద్ద ఉన్న 170 గ్రాముల గంజాయిని సీజ్ చేసి విచారించినట్లు తెలిపారు .జిల్లా కేంద్రంలోని గృహకల్ప కాంప్లెక్స్, అసద్ బాబా నగర్, నందిగుట్ట వద్ద నుండి కొనుక్కొని వచ్చి ఇక్కడ ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్లు తెలిపారన్నారు. అక్కడికి వెళ్లి పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కనిపించిన నీరడి విజయ రాఘవ రాజును పట్టుకొని తనిఖీ చేయగా ఇతని వద్ద 100 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. వీరు ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్స్ ప్రమోద్ చైతన్య, చంద్రమౌళి, కానిస్టేబుల్స్ ధర్మేందర్ ,వికాస్, సందీప్, సాయిబాబా, గొల్ల శ్రీనివాస్, నరేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్‌బిన్ హందాన్



బాణాసంచా పేలుస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

తాహెర్ బిన్ హందాన్ తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మండల కాంగ్రెస్ నాయకులు బాణసంచాలు పేల్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, జాగిరపు నర్సారెడ్డి, కుందేళ్ల శ్రీనివాస్, మహేష్ రెడ్డి, భూషణ్, దిగంబర్, ఆసిఫ్, నర్సింగ్, మల్లేష్ యాదవ్, మైపాల్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆందోళన వద్దు

- పరీక్షలంటే భయం వీడాలి
- తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యం చెప్పాలి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పరీక్షలే జీవితం కాదు.. జీవితమే పరీక్షలు కాదు అని సైకలాజిస్టులు సూచిస్తున్నారు. పరీక్షలంటే ఒత్తిడికి గురికావొద్దని, మానసిక ఆందోళనను దరిచేరనివ్వొద్దని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు కొనసాగుతుండగా, త్వరలో పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులకు పలు సూచనలు ఇస్తున్నారు.

'విద్యార్థులు పరీక్షలు అనే ఒక ఫోబియాకు గురవుతున్నారు. మానసిక ఆందోళనలో ఉన్నారు. పరీక్షలు రాగానే కచ్చితంగా ఎనిమిది గంటలు నుండి తొమ్మిది గంటలు నిద్రపోవాలి. నీళ్లు ఎక్కువసార్లు తాగుతూ ఉండాలి. మానసిక ఆందోళనకు గురి కావద్దు. శ్వాసను దీర్ఘంగా పీల్చి బిగబట్టి మళ్లీ వదిలాలి. ఇలా పరీక్ష సమయంలోనే కాకుండా రోజు కూడా చేస్తే మానసిక ఆందోళన తగ్గే అవకాశం ఉంటుంది. కుర్చీలో కూర్చుండి మన కాళ్ళను భూమికానించి ఉచ్వాస నిచ్వాస క్రియలను చేయాలి. అలా చేస్తే మానసిక ఆందోళన చాలా వరకు తగ్గే అవకాశం ఉంటుంది. పరీక్షలకు వెళ్లేముందు ఎవరితో గొడవ పడొద్దు. పరీక్ష సెంటర్‌కు ముందే బయలుదేరి గంట ముందుగానే చేరుకునే ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు 10 గంటలకు ప్రారంభం అని ఉంటే 9 గంటలకు పరీక్షకు అనుమతిస్తారు. 8.30 నిమిషాలకు లేదా 8 గంటలకు ఉండే ప్రయత్నం చేసుకోవాలి. చుట్టూ ఉన్న పరిసరాలను గమనించాలి. ఆ వాతావరణం ఆవలింపు చేసుకోవాలి. మార్గమధ్యలో చిన్నచిన్న ఎటువంటి సంఘటన, గొడవలు జరగకుండా చూసుకోవాలి. మనకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆ గంట సమయం ముందు రావడం వల్ల ప్రశాంతంగా పరీక్ష రాసే అవకాశం ఉంటుంది. లేకపోతే ఆ ఆందోళనకు గురై పరీక్ష మంచిగా రాయలేకపోవచ్చు. అలాగే పిల్లలకు తల్లిదండ్రులు ధైర్యంగా, అండగా నిలబడే ప్రయత్నం చేయాలి. తండ్రి లేదా తల్లి దగ్గరుండి చదివించాలి. ప్రసార మాధ్యమాలను దూరంగా ఉంచాలి. మొబైల్ ఫోను, టీవీ, ఇంటర్నెట్ ఎటువంటి కనెక్షన్ అయినా అన్నింటిని కూడా తగ్గించి చదువుకోవడానికి ప్రోత్సాహం చేయాలి. తల్లీ, తండ్రి, అన్న లేదా అక్క ఎవరైనా దగ్గరగా ఉండి చదివిపించే ప్రయత్నం చేయాలి. అలా చేసిన ట్లయితే ఖచ్చితంగా మంచిగా చదువుకొని మానసిక ఆందోళనకు గురి కాకుండా కుటుంబ సభ్యుల సహకారం తో పరీక్షలు మంచిగా రాసే అవకాశం ఉంటుంది. పరీక్ష మంచిగా రాయ లేకపోయినా పర్వాలేదు నీకు నేనున్నాను అంటూ ధైర్యం ఇస్తున్నట్లయితే వాళ్ళు పరీక్ష మంచిగా రాసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా "నీకు జీవితమే పరీక్ష కాదు.. పరీక్షనే జీవితం కాదు అంటూ పిల్లలకు వెన్ను తట్టి ధైర్యంగా ఉండాలి అప్పుడే వారు మానసిక ఆందోళనకు గురికాకుండా పరీక్షలు మంచిగా రాస్తారు. పండ్లు ఎక్కువ తీసుకోవాలి. నూనె పదార్థాలు ఎక్కువ తినకుండా చూసుకోవాలి. వారికి ఇష్టమైన ఆహారాన్ని అందించాలి. ఒకవేళ జంక్ ఫుడ్ అయినప్పటికీ తగ్గించి పరీక్ష లప్పుడు ఇష్టమైన ఆహారాన్ని అందించినట్లయితే వారిలో మానసిక ఉల్లాసానికి సంబంధించిన ద్రవాలు విడుదలై హుషారుగా, ఉల్లా సంగా, ఉత్సాహంగా ఉండి పరీక్షలు మంచిగా రాసే అవకాశం ఉంటుంది. ప్రశాంతంగా ఎటువంటి బాదర బందీ లేకుండా చదువుకునే అవకాశం కూడా ఉంటుంది. అలాగే పిల్లలకు ప్రతిరోజు ఒక గంట చొప్పున క్రీడలు ఆడేలా అవకాశం కల్పించినట్లయితే వాళ్లలో మానసిక ఉల్లాసానికి సంబంధించిన మంచి ద్రవాలు విడుదలై మానసిక ఆందోళన లేకుండా ఉండే అవకాశం ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ సారంగాపూర్ క్యాంపస్ సైకాలజీ అధ్యాపకులు డాక్టర్ ఆర్. కరుణాకర్ తెలిపారు

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని మల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పట్నం సాయిలు(33) అనే వ్యక్తి రోజు మాదిరిగానే మధ్యాహ్నం రెండు గంటలకు ఊర చెరువుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోవడంతో నీటిమునిగి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెరువులో వ్యక్తి మృతదేహం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిరుమన్‌పల్లి గ్రామంలో రోడ్డు ఇబ్బందులపై ఎమ్మెల్యే మదన్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి ఎమ్మెల్యే గ్రామాభివృద్ధి నిధుల నుంచి రూ.10లక్షల నిధులు మంజూరు చేయించారు. అందులో భాగంగా శనివారం ఎమ్మెల్యే అభివృద్ధి నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మదన్మోహన్ ఆదేశాలతో ప్రారంభించారు. చాలా సంవత్సరాలుగా ఉన్న రోడ్డు సమస్యను తీర్చినందుకు ఎమ్మెల్యే మదన్మోహన్‌కు గ్రామస్తులు, కార్యకర్తలు మారా రమేష్‌రెడ్డి, ఎస్.కె.బాలయ్య, కావేటి సాయిలు, బాదావత్ పరమేష్, ఉప్పల్వాయి రాములు, మారా శ్రీనివాస్‌రెడ్డి, పైడి తిరుపతిరెడ్డి, ముదుపు భాస్కర్‌రెడ్డి, నారెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాగుల చిన్న మైసగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉద్యోగులు లంచాలిచ్చి రావొద్దు

- **లంచాలు లేకుండా పనిచేయాల్సి వస్తది: ఎమ్మెల్యే కేవీఆర్**

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డికి వివిధ శాఖలో పనిచేయడానికి వస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ నాయకుడికి లంచాలు ఇచ్చి రావొద్దని, కామారెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి లంచాలకు అవకాశం లేకుండా పనులు చేయాలని, లంచాలు తీసుకుంటే వెంటనే చర్యలు తీసుకుంటామని కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ నాయకులకు అధికారం లేక ఆకలితో ఉన్నారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వ అధ్వానంగా తయారైందన్నారు. ఎస్సై నుంచి మొదలుకొని కలెక్టర్ వరకు బదిలీ కావాలంటే లక్షల్లో రూపాయలు చెల్లించవలసిందేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చిందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను ఈ కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. జిల్లా అధికారుల బదిలీ కావాలంటే పది నుంచి 30 లక్షల వరకు లంచాలు తీసుకుంటున్నారని లంచం ఇస్తేనే పోస్టింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కామారెడ్డిలో అధికారాన్ని నిర్లయం చేసి డబ్బు సంపాదించాలనుకునే అధికారులు కామారెడ్డి నుంచి వేరే చోటికి లంచమిచ్చి అయినా వేరే చోటికి బదిలీ చేసుకోవాలన్నారు. గృహలక్ష్మి పథకంలో విద్యుత్తుపై మరోసారి ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. 200 యూనిట్ల వరకు ఫ్రీ అని, 1 యూనిట్ కాలిన పూర్తిగా 200 యూనిట్ల కూడా బిల్లు కట్టవలసిందేనని చెప్పడం సరికాదన్నారు. తెలంగాణలో విజయసంకల్పయాత్ర విజయవంతంగా పూర్తవుతుందని, తెలంగాణ రాష్ట్రంలోని 17 ఎంపి స్థానాలను గెలుచుకునేందుకు కృషి చేయనున్నట్టు వివరించారు. ఈ విజయ సంకల్ప యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడితో పాటు కేంద్ర మంత్రులు, నాయకులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందే ప్రతి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, పండరి, మోహన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

గృహజ్యోతి ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి/నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎంపీటీసీ తూర్పు రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నారని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బాలరాజ్, కాంగ్రెస్ నాయకులు మదర్ లైన్ రమేష్, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గాంధారి : గృహజ్యోతిని ప్రారంభిస్తున్న పలువురు

నాగిరెడ్డిపేట్‌లో గృహ జ్యోతి పథకం ప్రారంభం..

నాగిరెడ్డిపేట్ : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గృహజ్యోతి పథకాన్ని నాగిరెడ్డిపేట్ గ్రామంలో ఎంపీపీ రాజుదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ గణేష్, ఏఈ మనోరంజన్‌తో పాటు కోఆప్షన్ సభ్యులు షాహిద్ పాషా, ఇమామ్, లక్ష్మణ్, గులాం హుస్సేన్, నరసింహారెడ్డి, సాయగౌడ్, కలీం తదితరులు పాల్గొన్నారు.

మందులు ఇచ్చే వారే లేరా..?

- **ఆస్పత్రి సిబ్బందిపై తహసీల్దార్ ఆగ్రహం**

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిపై తహసీల్దార్ సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు కనీసం మందులు ఇచ్చే నాథుడు లేకపోవడంతో రోగులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. దీంతో వైద్య సిబ్బంది పల్స్‌పోలియోకు సంబంధించిన విధులలో నిమగ్నమయ్యారు. ఆస్పత్రిలో ఉండాల్సిన డాక్టర్, ఫార్మసిస్ట్ ఆస్పత్రిలో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో కేవలం అటెండర్ మాత్రమే ఉండటంతో.. ఆస్పత్రిలో లేని సిబ్బంది వెంటనే తనను వచ్చి కలవాలని అక్కడున్న సిబ్బందితో చెప్పారు. కూత వేటు దూరంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికీ ఆస్పత్రి నిర్వహణపై మండిపడ్డారు. మెజిస్ట్రేట్ వచ్చినప్పటికీ సిబ్బంది పిలిచినా స్పందించకపోవడంతో ఆమె సిబ్బంది దగ్గరికి వెళ్లి మాట్లాడారు. విధి నిర్వహణలో తప్పులను ఉపేక్షించేది లేదని వెంటనే డాక్టర్ వచ్చి సమాధానం చెప్పాలన్నారు.



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తహసీల్దార్

మాపైనే దాడి.. మాపైనే కేసులు

- **బాధితుడి ఆవేదన**

నవతెలంగాణ-తాడ్వాయి

'ప్రత్యర్థులు మా పైనే దాడి చేశారు. తల పగిలిందని తాడ్వాయి పోలీస్ స్టేషన్‌కు వెళితే పోలీసులు మాపైనే కేసులు నమోదు చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు.' అంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామంలో గత పది రోజుల క్రితం చేనులోని ఒడ్డు విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో గ్రామానికి చెందిన శంబల భూపతిపై ప్రత్యర్థులు దాడి చేసి బండరాయితో తలపై గట్టిగా బాధితనట్టు ఆయన ఆరోపించారు. భూపతి, భూపతి మామ శివరాములకు దెబ్బలు తగిలాయి. ఈ విషయమై భూపతి, శివరాములు తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి గ్రామానికి చెందిన శంబల మైపాల్, శంబల భాస్కర్, రాజయ్య, రవీందర్‌లు తమపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై వెంకటేశ్వర్లు నలుగురిపై కేసు నమోదు చేశారు. అనంతరం దాడి జరిగిన ఎనిమిది రోజుల తర్వాత తిరిగి తమపై ఎస్సై కేసు నమోదు చేసి వేధిస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులే అన్యాయం చేస్తే ఎలా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై కేసు వద్దు మాట్లాడుకోమని వేధిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై తాము ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని వివరించారు. న్యాయం కావాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే తమపైనే పోలీసులు కేసులు నమోదు చేయడం న్యాయమా అని వారు ప్రశ్నించారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.



దాడికి గురైన బాధితుడు

ప్రభుత్వ పథకాలతో పేదలకు ఎంతో మేలు

- **జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి**

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీ పథకాలతో, ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, ప్రజాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం గృహ జ్యోతి, గృహలక్ష్మీ పథకాలను ప్రభుత్వం అమలు చేసినందుకు, మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సోనియా గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలా భిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, పేదల అభివృద్ధి ప్రభుత్వమని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారం టీలను అమలు చేసి, పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభు త్వం అండగా ఉంటుందని అన్నారు. త్వరలో ప్రభు త్వం రైతు రుణమాఫీ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, కాంగ్రెస్ నాయకులు నారెడ్డి రాజిరెడ్డి, రాతుల రెడ్డి నాయక్, బండి ప్రవీణ్, పెంద్యాల నర్సారెడ్డి, బాబురావు, శ్యామ్, గడ్డం చిన్న గంగారెడ్డి, రఘుపతిరెడ్డి, నామాల రవి, బిపేట నర్సింలు, కిషన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



పలువురు చిత్రపటాలకు పాలాభిషేకం

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వ్యవసాయ విస్తీర్ణ అధికారి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి వ్యవసాయ విస్తీర్ణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలు చండీగఢ్‌లో నిర్వహిస్తుండగా.. ఆయన పాల్గొననున్నారు. ఆదివారం నుంచి 9వ తేదీ వరకు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఉన్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి ఏఈఓలు రైతులకు అభినందనలు తెలిపారు.

ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పలువురు నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చంద్రయ్యగారి అనంతరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గాంధీచౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఆరు గ్యారెంటీలలో భాగంగా నాలుగు గ్యారెంటీలను పథకాలను స్వల్పకాలంలో అమలు చేస్తుందన్నారు. ఈ నెల నుంచి ఉచిత విద్యుత్‌తో జీరో విద్యుత్ బిల్లులను ప్రజలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆశపోయిన శ్రీనివాస్, రామస్వామిగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, ఎంపీటీసీ నిమ్మశంకర్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి తాటిపల్లి శ్రీకాంత్, సీతారాం ప్రసాద్, గోపాల్‌రెడ్డి, నాగారపు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలను కోటగిరి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు నగదును మేనేజర్ గణేష్, సహాయ మేనేజర్ వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెకండియర్‌లో ఒకరు గైర్హాజరు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సెకండ్ ఇయర్ ఆంగ్ల పరీక్షకు 224 మందికి ఒకరు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ రిజ్వానా సమీర్ తెలిపారు. సమయానికి అనుగుణంగా విద్యార్థులు వస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

శిశువుల బరువు, ఎత్తులు పరిశీలన

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని మిర్జాపూర్ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ సూపర్వైజర్ ములకల మని శిశువుల బరువు, ఎత్తును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మికి పలు సూచనలు అందజేశారు.

నందివాడలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని నందివాడలో సీసీ రోడ్డు పనులను ప్రజాప్రతినిధులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ప్రత్యేక దృష్టితో నందివాడ గ్రామానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనతి కాలంలోనే నిధులు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, కందడి వేణు, ప్రశాంత్‌గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధ పాలన నుంచి కాంగ్రెస్ పార్టీలోకి..

- **పలువురి బీఆర్ఎస్ నాయకుల ప్రకటన**

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నిర్బంధ పాలన నుంచి బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ప్రజాపాలన కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని మాజీ జెడ్పిటిసి దివిటి కిషోర్ యాదవ్, జిల్లా గ్రంథాలయ శాఖ మాజీ చైర్మన్ డి.శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం నసరుల్లాబాద్ మండలంలోని అంకోల్ క్యాంప్ శివారులోని దివిటి శ్రీనివాస్ యాదవ్ ఫామ్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్, అంకోల్ తండా, నెమ్లి, దుర్కి, మిర్జాపూర్ తదితర గ్రామాల నుంచి సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, దుర్కి పలు సొసైటీ డైరెక్టర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఈనెల 5వ తేదీన బాన్సువాడ పట్టణంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ దుర్గి సొసైటీ అధ్యక్షులు దివిటి శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పిటిసి కిషోర్ యాదవ్ మాట్లాడుతూ.. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్ళామని అక్కడి నుంచి ఇప్పటి వరకు స్వచ్ఛం దంగా పార్టీకి కట్టుబడి పని చేసి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించామన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో పోచారం నిర్బంధ పాలన కొనసాగుతుందని కార్యకర్తలు, సామాన్య ప్రజలు ఒక ఎమ్మెల్యేతో మాట్లాడలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నేరుగా ఎమ్మెల్యేను కలిసే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు విరక్తి చెంది నిర్బంధ పాలను వదిలేసి ప్రజాపాలన కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని వారు అన్నారు. ఐదవ తేదీన నసురుల్లాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ నుంచి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నాయకులు పార్టీకి రాజీనామా చేసిన వారితో నస్రుల్లాబాద్ మండల కేంద్రం నుంచి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీతో వెళ్లి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ ముస్తఫా హుస్సేన్, దుర్కి ఎంపిటిసి డాక్టర్ నారాయణ, హాజీపూర్, అంకోల్ తండా మాజీ సర్పంచ్‌లు అరిగే అంజయ్య, బద్యా నాయక్, కదీర్, శ్రీనివాస్, గంగాధర్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

100 భగవద్గీతలు అందజేత

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని రామకృష్ణ సేవా సమితికి పోతంగల్ మండల కేంద్రానికి చెందిన సితాలే కుటుంబ సభ్యులు డాక్టర్ రమేష్ వంద భగవద్గీతలను శనివారం అందజేశారు. భగవద్గీత పారాయణం మానవున్ని తేజవంతునిగా తయారు చేస్తుందని, ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని పేర్కొన్నారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత క్లాసులు ఏర్పాటు చేయడం పట్ల రమేష్ ఆనందం వ్యక్తం చేశారు.